సాక్షి
హనుమకొండ

బుధవారం | 1 | అక్టోబర్ | 2025



ఆహారం.. ఆరోగ్యం
సహజ సిద్ధంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, గుడ్లు తదితర ఆహార పదార్థాలను తగ్గించి ప్రజలు పాశ్చాత్య ఆహారపు అలవాట్లను అలవర్చుకుంటున్నారు. - 10లో▸



గోదావరి కాస్త తగ్గుముఖం..
కాళేశ్వరం వద్ద గోదావరికి సోమవారం మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయగా.. మంగళవారం వరద ఉధృతి కాస్త తగ్గుముఖం పట్టింది. - 10లో▸

గరిష్టం/కనిష్టం
$31.2^0/24.4^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు కాస్త ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జూడా నాయకుల ఏకగ్రీవ ఎన్నిక


శ్రీనాథ్


న్యూటన్

ఎంజీఎం: ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఫైమా) జాతీయ ప్యానెల్‌లో తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (జూడా) నాయకులు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఫైమా జాతీయ కో–చైర్మన్‌గా డాక్టర్ దుబ్యాల శ్రీనాథ్, జాతీయ కార్యదర్శిగా డాక్టర్ ఇస్సాక్ న్యూటన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో మద్దతు ఇచ్చిన సహచర వైద్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్రం తరఫున బలమైన ప్రాతినిధ్యం వహిస్తూ, వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వీరికి జూడా నాయకులు, వైద్య సంఘాల ప్రతినిధులు, పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

వెబ్‌సైట్‌ను పునరుద్ధరించాలి

న్యూశాయంపేట: మైనార్టీ పథకాల దరఖాస్తు కోసం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించే వెబ్‌సైట్‌ను పునరుద్ధరించాలని మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ యాకూబ్‌పాషా మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. మైనార్టీల కోసం రెండు కొత్త పథకాలను ప్రభుత్వం తీసుకొచ్చిందని పథకాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 6 వరకు గడువు ఉన్నా సోమవారం నుంచి ఎలాంటి సమాచారం లేకుండా వెబ్‌సైట్‌ను నిలిపేశారన్నారు. ఈ అంశాన్ని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ దృష్టికి తీసుకెళ్లగా.. ఎన్నికల కోడ్ కారణంగా సైట్ తాత్కాలికంగా ఆగిపోయిందని తెలిపారన్నారు. ఎన్నికల కోడ్ రాకముందే పథకం ప్రారంభమైనందున సైట్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ప్రీప్రైమరీ పాఠశాలల్లో ఇన్‌స్ట్రక్టర్ల నియామకం

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో ఈవిద్యాసంవత్సరంలో 45 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇందులో ఒక్కో పాఠశాలకు ప్రీప్రైమరీ తరగతుల విద్యాబోధనకు ఒక ఇన్‌స్ట్రక్టర్, ఒక ఆయా నియామకానికి జిల్లా విద్యాశాఖ దరఖాస్తులు ఆహ్వానించింది. 45 ప్రీప్రైమరీ తరగతులకు 45 మంది ఇన్‌స్ట్రక్టర్లకు, 45 మంది ఆయాలకు దరఖాస్తులు స్వీకరించారు. ఇన్‌స్ట్రక్టర్లకు ఇంటర్ అర్హత నిర్ణయించగా.. 1,114 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. ఆయాలకు ఏడో తరగతి అర్హత ఉండగా.. 267 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఎక్కువగా దరఖాస్తులు రావడంతో కొద్ది రోజులుగా వాటిని పరిశీలించి కసరత్తు చేసి 45 మంది ఆయాలుగా ఎంపిక చేశారు. 44 మంది ఇన్‌స్ట్రక్టర్లను ఎంపిక చేశారు. జిల్లాలోని పెద్దకొడపాక బాలుర ప్రాథమిక పాఠశాలకు ఇన్‌స్ట్రక్టర్‌గా ఎవరూ దరఖాస్తు చేసుకోలేదు. ఈఎంపిక ప్రక్రియకు కలెక్టర్ చైర్మన్‌గా ఉన్నారు. సెలక్షన్ కమిటీ ఎంపిక చేసిన ఇన్‌స్ట్రక్టర్ల, ఆయాల జాబితాను వెల్లడించారు. ప్రతి నెల ఒక్కో ఇన్‌స్ట్రక్టర్‌కు రూ.8 వేలు, ఆయాకు నెలకు రూ.6 వేలు చొప్పున రెమ్యూనరేషన్ చెల్లిస్తారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి



విద్యారణ్యపురి: త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారిని, ఉద్యోగ విరమణకు ఆరు నెలలలోపు సమయం ఉన్నవారిని మినహాయించాలని మంగళవారం తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు ఇతర బాధ్యులు జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అదేవిధంగా ఏడాదిలోపు వయసున్న పిల్లల తల్లులకు, గర్భిణి ఉద్యోగులకు వివిధ శస్త్ర చికిత్సలు చేసుకున్న వారిని, దివ్యాంగ ఉద్యోగులకు ఈ ఎన్నికల విధులనుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. స్పందించిన లక్ష్మీరమాకాంత్ ఒక కమిటీని మినహాయింపు ఇస్తామని హామీ ఇచ్చినట్లు రాజు తెలిపారు. సీనియార్టీ స్కేల్స్ ప్రాతిపదికన ఎన్నికల బాధ్యతలను అప్పగించాలని తాము కోరినట్లు రాజు తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు డి.కిరణ్‌కుమార్, జిల్లా కార్యదర్శి సీఎస్ఆర్ మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

‘స్థానిక’ ఏర్పాట్లలో నిమగ్నం

- ఇప్పటినుంచే ఎన్నికల ప్రణాళికలో అధికార యంత్రాంగం
- నామినేషన్ల స్వీకరణకు 46 క్లస్టర్లు, 58 మంది రిటర్నింగ్ అధికారులు



హన్మకొండ: హనుమకొండ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు జిల్లా అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోంది. ఎన్నికలను సజావుగా జరిపేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేసింది. నామినేషన్ల ఘట్టం సమీపిస్తుండడంతో ఈ దిశగా ఏర్పాట్లు చేస్తోంది. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జిల్లాలో రెండు విడతల్లో జరగనున్నాయి. అవసరమైన సిబ్బందిని సమకూర్చుకోవడం, కావాల్సిన సదుపాయాలు ఒక్కోటి చేసుకుంటూ ముందుకు పోతున్నారు. హనుమకొండ జిల్లా ప్రజాపరిషత్ సీఈఓ, సంబంధిత విభాగం ఉద్యోగులు, కలెక్టరేట్ ఉద్యోగులు ఈ పనుల్లో నిమగ్నమయ్యారు.

631 పోలింగ్ స్టేషన్లు..

జిల్లాలో మొత్తం 3,70,871 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 1,80,666, మహిళలు 1,90,201 మంది ఉన్నారు. ఇతరులు నలుగురు ఉన్నారు. జిల్లాలో 210 గ్రామ పంచాయతీలుండగా 631 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఇందులో 400లోపు ఓటర్లున్న పోలింగ్ స్టేషన్లు 25, 401 నుంచి 500 ఓటర్లున్న పోలింగ్ స్టేషన్లు 67, 501 నుంచి 750 మంది ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్లు 539 ఉన్నాయి. జెడ్పీటీసీ నామినేషన్లు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో స్వీకరిస్తారు. ఎంపీటీసీల నామినేషన్ల స్వీకరణకు క్లస్టర్లను గుర్తించారు. జిల్లాలో 129 ఎంపీటీసీ స్థానాలకు గాను నామినేషన్ల స్వీకరణకు 46 క్లస్టర్లు గుర్తించారు. మండలంలోని ఎంపీటీసీ సంఖ్యను బట్టి రెండు నుంచి ఆరు వరకు క్లస్టర్లు ఏర్పాటు చేశారు.

రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల నియామకం..

నామినేషన్ల స్వీకరణకు 58 మంది రిటర్నింగ్ అధికారులు, 58 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమించారు. 500 మంది ఓటర్ల లోపు ఉన్న పోలింగ్ స్టేషన్లకు ఒక ప్రిసైడింగ్ అధికారితోపాటు నలుగురు సిబ్బందిని, 500 మంది ఓటర్ల పై ఉన్న పోలింగ్ స్టేషన్ ఒక ప్రిసైడింగ్ అధికారితో పాటు ఐదుగురు సిబ్బందిని నియమించేలా ప్రణాళిక రూపొందించారు. ఈమేరకు 757 మంది పోలింగ్ ఆఫీసర్లను, 3,666 మంది సిబ్బందిని నియమించి శిక్షణ కూడా ఇచ్చారు. పెద్ద బ్యాలెట్ బాక్స్‌లు 696, మీడియం బ్యాలెట్ బాక్స్‌లు 232 సమకూర్చుకుంటున్నారు. జిల్లాను 40 జోన్‌లుగా 74 రూట్‌లుగా గుర్తించారు. ప్రశాంత పోలింగ్ స్టేషన్లుగా 149, క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌లుగా 240, సెన్సిటివ్ పోలింగ్ స్టేషన్లుగా 227, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ స్టేషన్లుగా 15 గుర్తించారు. నోటిఫికేషన్ విడుదలయ్యే నాటికి అవసరమైన అన్ని ఏర్పాట్లు ఇప్పటినుంచే పూర్తి చేస్తున్నారు.

ఆశావహుల ప్రయత్నాలు ముమ్మరం

మరోవైపు గ్రామాల్లో రాజకీయాలు రోజురోజుకూ వేడెక్కుతున్నాయి. ప్రజల మద్దతు కూడగట్టడంతోపాటు పార్టీ అభ్యర్థిత్వం కోసం ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. రిజర్వేషన్ వరంగా అందివచ్చిన అవకాశాన్ని ఎలాగైనా సద్వినియోగం చేసుకోవాలనే కృతనిశ్చయంతో ముందుకుసాగుతున్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు పార్టీ గుర్తులపై జరగనుండడంతో ఎలాగైనా పార్టీ టికెట్ సాధించుకోవాలనే పట్టుదలతో అగ్రనేతల ఆశీస్సులు అందుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

విడతకు ఆరు మండలాలు

- జిల్లాలో రెండు విడతల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు

హన్మకొండ: హనుమకొండ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను రెండు విడతల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఈ నెల 29న షెడ్యూల్ విడుదల చేసింది. మొదటి విడత పోలింగ్ అక్టోబర్ 23న. రెండో విడత అక్టోబర్ 27న జరగనుండగా నవంబర్ 11న ఓట్లు లెక్కిస్తారు. జిల్లా ప్రజాపరిషత్ పరిధిలో మొత్తం 12 మండలాలున్నాయి. 12 జెడ్పీటీసీ స్థానాలున్నాయి. ఇందులో మొదటి విడతల్లో ఆరు మండలాలు భీమదేవరపల్లి, ధర్మసాగర్, ఎల్కతుర్తి, హసన్‌పర్తి, ఐనవోలు, వేలేరు మండలాల్లోని 67 ఎంపీటీసీ స్థానాలకు, ఆరు జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. రెండో విడతలో ఆత్మకూరు, దామెర, నడికూడ, పరకాల, శాయంపేట, కమలాపూర్ మండలాల్లోని 62 ఎంపీటీసీ స్థానాలకు, ఆరు జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి.

మండలం	ఎంపీటీసీలు	పోలింగ్ కేంద్రాలు
మొదటి విడత		
భీమదేవరపల్లి	14	69
ధర్మసాగర్	13	65
ఎల్కతుర్తి	12	59
హసన్‌పర్తి	09	40
ఐనవోలు	13	59
వేలేరు	06	29
రెండో విడత		
ఆత్మకూరు	09	50
దామెర	08	36
కమలాపూర్	18	90
నడికూడ	10	47
పరకాల	05	26
శాయంపేట	12	61

రెండు విడతల్లో ఎన్నికలు

హన్మకొండ అర్బన్: స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి నవంబర్ 11వ తేదీ వరకు అమలులో ఉంటుందని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు.కలెక్టరేట్‌లో మంగళవారం రాత్రి స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఇందులో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్డీఓ డాక్టర్ నారాయణ, డీపీఓ లక్ష్మీ రమాకాంత్, జెడ్పీ సీఈఓ రవి, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈవి శ్రీనివాస్‌రావు, కొలను సంతోష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్యాంసుందర్, ప్రవీణ్‌కుమార్, నాగవెల్లి రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్‌గా రోహిత్ నేత



కమలాపూర్: మండల కేంద్రానికి చెందిన తౌటం రోహిత్ నేత ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. తౌటం సురేందర్–రాధిక దంపతుల కుమారుడు రోహిత్. తండ్రి సురేందర్ పోలీస్ శాఖలో హెడ్ కానిస్టేబుల్, తల్లి రాధిక గృహిణి, సోదరి సౌమ్య ఉన్నత విద్య కోసం యూఎస్ఏ వెళ్లారు. రోహిత్ ప్రాథమిక విద్యాభ్యాసం కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో, ఇంటర్, బీటెక్ హైదరాబాద్‌లో పూర్తి చేశారు. చిన్నప్పటి నుంచి చదువులో అత్యంత ప్రతిభ కనబర్చిన రోహిత్ బీటెక్ పూర్తి కాగానే ఏడాది పాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసి పేద ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతో ఉద్యోగం వదిలి రెండేళ్లు సివిల్స్, గ్రూప్–1 కోసం కఠోర సాధన చేసి డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం సాధించి ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్‌గా హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ వద్ద రిపోర్ట్ చేశాడు. రోహిత్ నేత మాట్లాడుతూ... ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా ఉద్యోగం వదిలేసినా తనను తన తల్లిదండ్రులు నిత్యం ప్రోత్సహించారని, ఉన్నత స్థితికి తన తల్లిదండ్రులే కారణమని కొనియాడాడు. మధ్య తరగతి కుటుంబంలో పుట్టి పెరిగిన తాను బలహీన వర్గాల కష్టాలు ప్రత్యక్షంగా చూశానని, అందుకే పేదల అభ్యున్నతి కోసం సేవ చేయాలన్నదే తన ఏకైక లక్ష్యమని, ఈ బాధ్యతను ఒక అవకాశంగా మాత్రమే కాకుండా తన పవిత్ర ధర్మంగా భావిస్తున్నట్లు తెలిపారు. తన పరిపాలనా విధానంలో పారదర్శకత, ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామీణాభివృద్ధి, యువ, మహిళా శక్తీకరణకు ప్రాధాన్యమిస్తానని తెలిపారు.

అయినా తగ్గేదేలే..

- వైన్స్ దరఖాస్తుల ఫీజు రూ. లక్ష నుంచి రూ.3 లక్షలకు
- ఎక్సైజ్ శాఖ టెండర్లతో ఖజానా గలగల



కాజీపేట అర్బన్: మందుబాబులకు మద్యం కిక్కు, ప్రభుత్వ ఖజానాకు ఎక్సైజ్ శాఖ వైన్స్ షాపుల టెండర్లతో కిక్కు అన్న చందంగా ఉంది. ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుగా నిలుస్తున్న లిక్కర్ సేల్స్‌తో ఎక్సైజ్ శాఖ తన మార్క్‌ను నిలబెట్టుకుంటుంది. దీంతో మద్యం వ్యాపారాన్ని ఎంచుకున్న వారికి ఓన్లీ బెనిఫిట్స్ తప్ప లాస్ లేని బిజినెస్‌గా మద్యం వ్యాపారం అంటూ ఏటా మద్యం వ్యాపారాన్ని తమ బిజినెస్‌గా ఎంచుకునే వారి సంఖ్య పెరిగిపోతోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, టెక్స్‌టైల్స్‌తో పాటు పొలిటీషియన్లు సైతం లిక్కర్ బిజినెస్‌లోకి వచ్చేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

పెరిగిన ఫీజు..

ఎక్సైజ్ టెండర్ల ప్రకటనను ప్రభుత్వం ఎప్పుడు ఇస్తుందా? అంటూ వేచి ఉండేవారు తమ లక్కు కిక్కును పరీక్షించుకునేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. దీంతో రెండేళ్ల కాల పరిమితితో వచ్చే వైన్స్ టెండర్లలో దరఖాస్తుల సంఖ్య పెరగడంతో ప్రభుత్వం దరఖాస్తుల ఫీజును సైతం పెంచుకుంటూ పోతూ దరఖాస్తుల ఫీజు తగ్గేదేలే ఆదాయం తగ్గేదేలే అంటూ రేట్లు పెంచేస్తున్నారు. కాగా.. 2019–21 వరకు రూ.1 లక్ష ఉన్న దరఖాస్తు ఫీజును 2021–23, 2023–25 వరకు దరఖాస్తు ఫీజును రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షలు పెంచారు. కాగా తాజాగా 2025–27 రెండేళ్ల కాలపరిమితితో వైన్స్ టెండర్లకు దరఖాస్తు ఫీజును రూ.3 లక్షలుగా ఖరారు చేశారు.

వివరాలు ఇవీ..

సంవత్సరం	దరఖాస్తులు	ఆదాయం
2021–23	2,983	రూ.59 కోట్లు
2023–25	5,859	రూ.117 కోట్లు

నాన్ రీఫండ్ అయినా..

‘వైన్స్ దరఖాస్తుల ఫీజు నాన్ రీఫండ్ అయినా పర్వాలేదు టెండర్లలో పాల్గొంటాం’ అంటూ మద్యం వ్యాపారులు దూసుకొస్తున్నారు. రియల్, టెక్స్‌టైల్, పొలిటీషియన్లతో పాటు సిండికేట్ రాయుళ్లు వంద సంఖ్యలో దరఖాస్తులను వేస్తూ ఖజానాకు ఆదాయాన్ని దండిగా ఇస్తున్నారు. కాగా, వరంగల్ అర్బన్ (హనుమకొండ) జిల్లాలోని గతంలో 65 వైన్స్‌గాను 2023–25కు 5,859 దరఖాస్తులకుగాను రూ.117 కోట్లు ఆదాయం రాగా, ఈసారి 2025–27కు దరఖాస్తులు డబుల్ అయ్యి 250 కోట్ల ఆదాయం టార్గెట్‌గా వస్తుందని అంచనా.

మటన్, చికెన్ షాపులు తెరవొద్దు..

రేపు జంతు వధశాలలు బంద్
గ్రేటర్ వరంగల్ సీఎంహెచ్‌ఓ రాజారెడ్డి

వరంగల్ అర్బన్: దసరా పర్వదినం, గాంధీ జయంతి సందర్భంగా డ్రై డే పాటించాలని బల్దియా ప్రజారోగ్యం అధికారులు మటన్, చికెన్ నిర్వాహకులకు, వ్యాపారులకు మంగళవారం సర్క్యులర్ జారీ చేశారు. షాపులు తెరవొద్దని, డ్రై డే తప్పనిసరిగా పాటించాలని హెచ్చరికలు చేశారు. గిర్మాజీపేట, లక్ష్మీపురం, కాజీపేట జంతువధ శాలలను బంద్ చేస్తున్నట్లు గ్రేటర్ వరంగల్ సీఎంహెచ్‌ఓ రాజారెడ్డి ప్రకటించారు. ఎట్టి పరిస్థితుల్లో అనుమతి ఉండదని పేర్కొన్నారు. నిబంధనలు పాటించకపోతే ట్రేడ్ లైసెన్స్ రద్దు చేసి, జరిమానాలు విధిస్తామని, కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. కాగా, పండుగ వేళ ఒకవైపు వైన్ షాపులు, మరోవైపు మాంసం దుకాణాలు మూసివేస్తుండడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. కొంతమంది ముందస్తుగా కొనుగోలు చేస్తున్నారు. మరికొందరు గొర్రెలు, మేకల కొనుగోలుకు ప్రయత్నిస్తున్నారు. వ్యక్తిగతంగా ఇళ్ల వద్ద వధించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

సీఈఏ నిబంధనలు తప్పక పాటించాలి

డీఎంహెచ్‌ఓ అప్పయ్య

ఎంజీఎం: జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నొస్టిక్ సెంటర్లు, క్లినిక్‌లు, స్కానింగ్ సెంటర్లు తప్పనిసరిగా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ (సీఈఏ) నిబంధనలు పాటించాలని హనుమకొండ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య సూచించారు. మంగళవారం నగరంలోని కనెక్ట్ డయాగ్నస్టిక్స్, విజేత స్కాన్స్ డయాగ్నోస్టిక్స్‌లను క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ బృందంతో కలిసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయా కేంద్రాల అనుమతి పత్రాలను తనిఖీ చేశారు. రేడియేషన్‌కు సంబంధించి అటామిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు అనుమతి పత్రాలు పరిశీలించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ అప్పయ్య మాట్లాడుతూ.. సీఈఏ నియమాల ప్రకారం ధరలు నిర్ణయించే అధికారం జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీకి లేదన్నారు. డయాగ్నోస్టిక్స్ సెంటర్లు, హాస్పిటల్‌ల్లో తాము తీసుకునే ఫీజు, టెస్టులకు సంబంధించి ధరలను తెలుగు, ఇంగ్లిష్‌లో ప్రజలకు కనిపించేలా ప్రదర్శించాలని ఆదేశించారు. టారిఫ్ లిస్ట్ ప్రదర్శించని విజేత స్కాన్స్ డయాగ్నస్టిక్స్ కేంద్రానికి నోటీసు జారీ చేయనున్నట్లు తెలిపారు.

సిద్ధిధాత్రి అలంకరణలో భ్రమరాంబిక



ఐనవోలు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు మంగళవారం మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో భ్రమరాంబిక అమ్మవారు సిద్ధిధాత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా ఆలయంలో ఖడ్గమాల, నవవర్ణ అర్చన, అలంకారం, శ్రీచక్రార్చన, నిత్యాహ్నికం, శ్రీ సూక్తపారాయణం, మహానివేదన, నీరాజన మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు విశేషంగా నిర్వహించారు. ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ మాట్లాడుతూ.. సిద్ధిధాత్రి రూపంలో అమ్మవారు అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యం, ఈశ్విత్వం, వశిత్వం అనే అష్టసిద్ధులు ప్రసాదిస్తుందని తెలియజేశారు. ఈమె కరుణతోనే పార్వతీదేవి శివుడి అర్ధ శరీరం పొందినట్లుగా పురాణ కథనం ఉందన్నారు. అమ్మవారి వాహనం సింహం, చతుర్భుజాలతో కమలంపై ఆసీనురాలై ఉంటుందన్నారు. కుడి వైపు చేతులలో శంఖం, గద, ఎడమ వైపు చేతులలో శంఖం, కమలం ఉంటుందని భక్తులకు వివరించారు. ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్, ఐనవోలు మధుకర్ శర్మ, వేద పండితులు గట్టు పురుషోత్తమశర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, అర్చకులు నందనం భానుప్రసాద్, మధుశర్మ, శ్రీనివాస్, నరేశ్ శర్మ, దేవేందర్, ఆలయ ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.

తప్పుల తడకగా రిజర్వేషన్లు!

- ఎన్నికల పేరిట ఊళ్లల్లో గందరగోళం.. కావాలనే ప్రభుత్వం చేస్తోంది....
- హుజూరాబాద్ నియోజకవర్గంలో రిజర్వేషన్లలో అక్రమాలు
- బీజేపీ నేత, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్


మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

కమలాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్లన్నీ తప్పులతడక అని, ఇది ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కమలాపూర్‌లోని తన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ సమస్యలను మొదటగా పట్టించుకునేది వార్డు స్థాయిలో వార్డు సభ్యుడు, గ్రామ స్థాయిలో గ్రామ సర్పంచ్, మండల స్థాయిలో ఎంపీటీసీలు, ఎంపీపీలు, జిల్లా స్థాయిలో జెడ్పీటీసీలు, జెడ్పీ చైర్మన్లని, రెండేళ్లయినా ఇప్పటి వరకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాలన్నీ వల్లకాడులుగా మారిపోయాయన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు తప్ప కింద రాజకీయ వ్యవస్థ ఎక్కడా కనిపించడం లేదన్నారు. తక్షణమే ఎన్నికలు నిర్వహించి గ్రామాల్లో ప్రజలకు సౌకర్యాలు మెరుగుపర్చాలని అనేక సార్లు డిమాండ్ చేశామని, నిన్ననే రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిందన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో భాగంగా బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి కౌన్సిల్‌లో, అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానించారో దానికి బీజేపీ సంపూర్ణ మద్దతు ఇచ్చిందని అన్నారు. ఆ తీర్మానాన్ని విజయవంతం చేయడంలో తాము కూడా హర్షధ్వానాలు వ్యక్తం చేశామని, తాము బీసీల 42 శాతం రిజర్వేషన్లకు విరుద్ధమైనోళ్లం కాదన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలోని సీతంపేట, శ్రీరాములపేట, వాగొడ్డు రామన్నపల్లిలో కమలాపూర్ మండలంలోని గుండేడులో ఒకటో, రెండో వైశ్య కుటుంబాలు ఉన్నా అక్కడ ఓసీలకు రిజర్వ్ చేశారన్నారు. ఒక్క హుజూరాబాద్ నియోజకవర్గంలోనే ఇలా ఉంటే 119 నియోజకవర్గాల్లో ఎన్ని తప్పులు దొర్లి ఉంటాయో అర్థం చేసుకోవచ్చన్నారు. బీసీ రిజర్వేషన్లు పెంచాలని, ఎన్నికలు నిర్వహించాలనే తాము కోరుకుంటున్నామని, తమపై బురద జల్లి దాడి చేసే ప్రయత్నం చేయవద్దన్నారు. ఇప్పటికైనా వెంటనే తాము ప్రకటించిన రిజర్వేషన్లను యథావిధిగా కొనసాగిస్తూ షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తామని, ఇందుకు పూర్తి బాధ్యత మాదేనని ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీ శ్రీరాం శ్యామ్, బీజేపీ నాయకులు దేశిని సదానందంగౌడ్, మాడ గౌతంరెడ్డి, బండి కళాధర్, చేలిక శ్రీనివాస్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం ఇక సాఫీ!



రూపు మార్చుకోనున్న కాజీపేట రైల్వే ఫ్లై ఓవర్

- మరమ్మతులకు రూ.59 లక్షలు మంజూరు

కాజీపేట: కాజీపేట రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి మరమ్మతులకు ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.59 లక్షలు మంజూరు చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. దాదాపు 50 ఏళ్ల కింద అప్పటి ప్రజల రవాణా కష్టాలను పరిగణనలోకి తీసుకుని నిర్మించిన బ్రిడ్జి నానాటికీ శిథిలావస్థకు చేరుకుంటోంది. బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న రేలింగ్ ముట్టుకుంటే కూలిపోయేలా ఉంది. ఏటా ఎంతో కొంత నిధులు మంజూరు అవుతున్నప్పటికీ గోడలకు రంగులు వేయడంతోనే సరిపెడుతున్నారు. బ్రిడ్జి కింది వైపు నుంచి రాకపోకలు సాగించే వెంకటాద్రి నగర్ కాలనీవాసులకు ఈ గోడలు పెను ప్రమాదంగా మారాయి. పెళ్లలు పడి బాటసారులు స్వల్పంగా గాయపడిన ఘటనలు ఉన్నాయి. వర్షాకాలం వచ్చిందంటే చాలు బ్రిడ్జిపై గుంతలు పడడం సాధారణంగా మారింది. ఈ గుంతలను సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో నిత్యం రాత్రి వేళ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. వాహనదారుల బాధలను చూడలేక ట్రాఫిక్ పోలీసులు జోక్యం చేసుకుని గుంతలను పూడుస్తున్నారు.

స్పందించిన ఎమ్మెల్యే నాయిని

కాజీపేట రైల్వే బ్రిడ్జి వల్ల కలుగుతున్న ఇబ్బందులను చూసిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సమస్య తీవ్రతను సీఎం దృష్టికి తీసుకెళ్లి రూ.59 లక్షలు మంజూరు చేయించారు. ఈనిధులతో బ్రిడ్జిపై ఉన్న సమస్యలన్నింటికీ అంచనాలు తయారు చేసి అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించడంతో చాలాకాలం తర్వాత బ్రిడ్జికి పూర్తి స్థాయిలో మరమ్మతులు జరగనున్నాయని పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్


గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుంటున్న శివకుమార్

ఐనవోలు: మండలంలోని ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నమని శివకుమార్‌కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆగస్టు 29న డాక్టరేట్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా.. మంగళవారం హైదరాబాద్‌లోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆడిటోరియంలొ నిర్వహించిన 26వ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చాన్స్‌లర్ అండ్ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ డాక్టరేట్‌ను శివకుమార్‌కు ప్రదానం చేశారు. తొమ్మిదో తరగతి విద్యార్థుల జీవశాస్త్ర సాధనపై జీవిత నైపుణ్యాలు, అధ్యయన అలవాట్ల ప్రభావంపై శివకుమార్ సమర్పించిన థీసిస్‌కు డాక్టరేట్ లభించింది. శివకుమార్ ఎమ్మెస్సీ బోటని, ఎమ్మెస్సీ సైకాలజీ, ఎంఈడీ, పీజీ డిప్లమా ఇన్ గైడెన్స్ అండ్ కౌన్సిలింగ్, నెట్ ఇన్ ఎడ్యుకేషన్‌తో పాటు ప్రస్తుతం పీహెచ్‌డీ పూర్తి చేశారు. శివకుమార్‌కు ఒంటిమామిడిపల్లి గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

గోదావరి వరదతో మునిగిన మిర్చి పంటలు

- 20 ఎకరాల్లో నష్టం..
- లబోదిబోమంటున్న రైతులు



వరదలో మునిగిన మిర్చి మొక్కలు

ఏటూరునాగారం: గోదావరి రెండు రోజులుగా ఉగ్ర రూపం దాల్చుతోంది. మండలంలోని రామన్నగూడెం వద్ద వరద రెండో ప్రమాద హెచ్చరికకు చేరింది. దీంతో ఏటూరునాగారంలోని మానసపల్లి, ఓడవాడ శివారు ప్రాంతాల్లోని మిర్చి పంటలు వరదతో మునిగాయి. మొక్కలు వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. అంతేకాకుండా వరద రెండు రోజుల నుంచి నిలిచి ఉండడంతో మిర్చి నారు కుళ్లి మొక్క చనిపోయే ప్రమాదం ఉందని రైతులు లబో దిబోమంటున్నారు. కందకట్ల రమేశ్, గండెపల్లి ఈశ్వరయ్య, గంప శ్రీను, వంగరి రామయ్య, పడాల మల్లికార్జున్, సాయిరి అశోక్, ఐయినాల రాములు, నామని సాంబశివరావుకు చెందిన సుమారు 20 ఎకరాల్లో మిర్చితోట మొత్తం మునిగింది. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పంటలు సాగు చేస్తుంటే వరద నట్టేట ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి పరిహారం ఇప్పించాలని బాధితులు వేడుకుంటున్నారు.

గోదావరి కాస్త తగ్గుముఖం

కాళేశ్వరం: ఎగువన వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కాళేశ్వరం వద్ద గోదావరికి వరద ఉధృతి కొనసాగుతోంది. మంగళవారం మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద 12 మీటర్ల ఎత్తులో నీటిమట్టం పుష్కరఘాట్లను తాకుతూ ప్రవహించింది. దిగువన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి 10.37లక్షల క్యూసెక్కుల వరద చేరింది. దీంతో బ్యారేజీలోని మొత్తం 85గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. కాగా, సోమవారం 13.290 మీటర్లకు వరద నీటిమట్టం చేరగా మొదటి ప్రమాదహెచ్చరిక జారీ చేశారు. బ్యారేజీ వద్ద 11.37 లక్షల క్యూసెక్కులు తరలిపోయాయి. కాగా, సాయంత్రం వరద ఉధృతి కాస్త తగ్గుముఖం పట్టింది.

తహసీల్దార్ కిరణ్ కుమార్‌కు జిల్లా కేటాయింపు

హన్మకొండ అర్బన్: గతంలో భీమదేవరపల్లి, కాజీపేట తహసీల్దార్‌గా పని చేసి ఎన్నికల సమయంలో జిల్లా నుంచి బదిలీ అయిన కిరణ్ కుమార్‌ను ప్రభుత్వం హనుమకొండ జిల్లాకు కేటాయించింది. దీంతో ఆయన మంగళవారం కలెక్టరేట్‌లో రిపోర్టు చేశారు. ప్రస్తుతం ఆయన కలెక్టరేట్‌లో సెక్షన్ సూపరింటెండెంట్‌గా విధులు కేటాయిస్తారని సమాచారం.

ఆహారం.. ఆరోగ్యం

సంప్రదాయ వంటలతోనే ఆరోగ్యం పదిలం

- పాశ్చాత్య అలవాట్లతో శరీరానికి నష్టం
- ఆకుకూరలు అన్నింటికీ ప్రయోజనం
- సేంద్రియ పంటలైతే మరీ మంచిది

ఖిలా వరంగల్ : ఆధునిక జీవన శైలిలో ఆహారపు అలవాట్లలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. సహజ సిద్ధంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, పాలు, గుడ్లు తదితర ఆహార పదార్థాలను తగ్గించి పాశ్చాత్య ఆహారపు అలవాట్లను అలవర్చుకుంటున్నారు. ఫలితంగా కడుపు నిండుతున్నా శరీరానికి మాత్రం నష్టం జరిగి యుక్త వయసులోనే వ్యాధులను కొని తెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా మహిళల్లో రక్తహీనత సమస్య అధికంగా ఉంటోంది. ఇందుకు కారణం తీసుకునే ఆహారమేనని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. కుటుంబీకులు ఆరోగ్యంగా ఉంటేనే ఆ ఇంట్లో ఆనందం వెల్లివిరుస్తుంది. ఈ క్రమంలో ప్రస్తుత రోజుల్లో మానవుడు ఆరోగ్యంగా ఉండానికి తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు ఏమిటో వైద్య నిపుణులు తెలుపుతున్నారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..

ఆకుకూరలు తప్పనిసరి



రోజు వారీ తీసుకునే ఆహారంలో తప్పనిసరిగా సహజ సిద్ధమైన ఆకుకూరలు, కూరగాయలతోపాటు పప్పుదినుసులు ఉండేలా తీసుకోవాలి. సజ్జలు, రాగులు, జొన్నలు, తోటకూర ఎక్కువ తీసుకోకపోవడం వల్ల గర్భిణులు, బాలింతలు అధిక శాతం మందులు వాడాల్సి వస్తుంది. గుడ్డు, పాలు రోజూ పరిమితంగా తీసుకోవాలి. పండ్ల రసాలు, కొబ్బరి నీరు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారు.

- అచ్చ వరుణ్, జనరల్ సర్జన్, వరంగల్

రక్తపోటు నివారణకు అరటి..



అరటి పండ్లు

గర్భిణులు, వృద్ధుల్లో అధిక రక్తపోటును నివారించేందుకు అరటి పండు దివ్య ఔషధం. సోడియం శాతాన్ని తగ్గించి శరీరం, రక్తాని ఉత్తేజ పరుస్తుంది. ఫలితంగా రక్తపోటు తగ్గుతుంది. పొటాషియం ఎక్కువ ఉండడంతో రక్తకణాలు శుభ్రపడి రక్తం సాఫీగా శరీర భాగాలకు సరఫరా అవుతుంది.

ఆకుకూరలు.. ఆరోగ్య ప్రదాతలు



పాలకూర

ఆకుకూరలు సహజ సిద్ధంగా తాజాగా ఉంటాయి. వీటిని అధికంగా తీసుకోవడం వల్ల కంటి చూపు మెరుగుపడుతుంది. విటమిన్ 'ఏ' పుష్కలంగా లభించే ఆకుకూరలతో కంటి సంబంధిత వ్యాధులకు దూరంగా ఉండొచ్చు. తోటకూర, గోంగూర, పాలకూర, మెంతికూర, పొన్నకూర, బచ్చలికూర, మునిగాకుతో మానవ శరీరానికి, మెదడుకు అవసరమైన ఎన్నో పోషకాలు లభిస్తాయి. వీటిని పప్పు దినసులలో కలిపి తీసుకోవడం వల్ల ఐరన్ అధికంగా పొందడంతోపాటు మంచి ప్రొటీన్లు అందుతాయి. ఫలితంగా గర్భిణుల్లో రక్తహీనత నివారించొచ్చు.

కోడిగుడ్డు..



నాటుకోడిగుడ్లు

కోడిగుడ్లలో ఉండే ప్రొటీన్, విటమిన్లతోపాటు కాల్షియం, మెగ్నీషియం, ఐరన్ ఆరోగ్యానికి ఉపకరిస్తాయి. గుడ్లను ఆహారంలో తీసుకుంటే చిన్నారులకు మానసిక, శారీరక పెరుగుదల బాగుంటుంది. గర్భిణులు , బాలింతలు, వ్యాధిగ్రస్తులకు కోడిగుడ్లు ఎంతో మేలు చేస్తాయి. బ్రాయిలర్ గుడ్లలో రసాయన అవశేషాలు కనిపిస్తున్నాయి. నాటు కోడిగుడ్డు తినడం మంచిది.

రాగులు..



రాగిపిండితో చేసిన వివిధ పదార్థాలు తినడం ద్వారా కాల్షియాన్ని పెంచుకోవచ్చు. విటమిన్ సీ, డీ, ఐరన్ ఎక్కువ లభిస్తాయి. బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. బలవర్ధకంగా ఉండడంతోపాటు మలబద్ధకాన్ని నివారించుకోవచ్చు. గ్రామాల్లో సహజ సిద్ధంగా లభించే ఆహారం తీసుకునే వారిలో కంటే మారుతున్న ఆహారపు అలవాట్ల స్వీకరిస్తున్న నగర, పట్టణ ప్రాంతాల ప్రజల్లో వ్యాధులు అధికంగా కనిపిస్తున్నాయి. అందుకే రాగి పిండిని విరివిగా తీసుకోవడం మంచిది.

మొలకలు గుండెకు మేలు..



పెసర్లతో తయారు చేసిన మొలకలు

మొలకలు కొద్దిగా తిన్నా కడుపు నిండుతుంది. కేలరీలు పెరగవు. శరీర బరువును తగ్గించుకోవాలనుకునే వారికి ఇది మంచి ఆహారం. మొలకల్లో ఏ, సీ, బీ విటమిన్లు ఉంటాయి. అలాగే, ఐరన్, పాస్పరస్, మెగ్నీషియం, పొటాషియం, కాల్షియంతోపాటు పీచు పదార్థం పొలేట్, కొవ్వు ఆమ్లాలు కూడా ఉంటాయి. వీటి వల్ల గుండె సంబంధిత వ్యాధులు రాకుండా ఉండడమే కాకుండా జీర్ణశక్తిని అదుపులో ఉంచి శరీర బరువు పెరగకుండా నియంత్రిస్తాయి. అలానే, జుట్టు పెరిగేందుకు ఆస్కారం ఉంటుంది.

ఇంటి పంటతో ఆరోగ్యం ..



సేంద్రియ పద్ధతిలో ఇంటి వద్ద పందిరి బీరకాయ

ప్రతీ ఇంటి ఆవరణ కూరగాయలు, ఆకుకూరతోటలు కావాల్సి ఉంది. వాటిని పండిస్తే స్వచ్ఛమైన ఆకు, కూరగాయలు తిని ఆరోగ్యంగా ఉంటారు. ఇంటి ఆవరణలో స్థలాలు లేకపోయినా ప్రత్యామ్నాయ పద్ధతులు అవలంబిస్తూ తమకు ఇష్టమైన కూరగాయలు పండించడంలో కొందరు ఆదర్శంగా నిలుస్తూ ఆరోగ్యవంత జీవనాన్ని అందుకుంటున్నారు.

ఘన్‌పూర్ అభివృద్ధికి రూ.50 కోట్లు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఘన్‌పూర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఈఏడాది జనవరిలో స్టేషన్‌ఘన్‌పూర్‌ను మున్సిపాలిటీగా చేశామని, సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.50 కోట్లు తీసుకొచ్చానన్నారు. మున్సిపాలిటీ కార్యాలయ భవనం, టౌన్ హాల్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, రోడ్డు వెడల్పు, తదితర పనులకు నిధులు మంజూరయ్యాయన్నారు. సదరు పనులన్నింటినీ ఏడాది లోపు పూర్తి చేస్తానని, వీటితో పాటు వంద పడకల ఆస్పత్రి, ఇంటిగ్రేటెడ్ డివిజనల్ ఆఫీస్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల తదితర పనులు పూర్తయితే స్టేషన్ ఘన్‌పూర్ రూపురేఖలు మారుతాయన్నారు. అలాగే, దేవాదుల మూడో దశ పనులకు రూ.1,001 కోట్లు కోట్లు మంజూరు చేశారని తెలిపారు. బీసీల రిజర్వేషన్‌పై సీఎం రేవంత్‌రెడ్డి దేశంలో ఏ ప్రభుత్వం చేయలేని సాహసోపేత నిర్ణయం తీసుకున్నారన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపినా స్పందన లేదని, బీసీలపై ప్రేమ వల్లించే పార్టీలు బీసీ రిజర్వేషన్‌కు మద్దతు తెలపాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ జూలుకుంట్ల లావణ్య శిరీశ్‌రెడ్డి, గ్రంథలయ సంస్థ జిల్లా చైర్మన్ మారుజోజు రాంబాబు, మార్కెట్ వైస్ చైర్మన్ ఐలయ్య, చిల్పూరు దేవస్థాన చైర్మన్ శ్రీధర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

'రైల్ ఓవర్ రైల్' ప్రాజెక్ట్‌కు ఆమోదం

డోర్నకల్ రైల్వే జంక్షన్ పరిధిలో 10.5 కిలోమీటర్ల నిర్మాణం

డోర్నకల్: డోర్నకల్ రైల్వే జంక్షన్ పరిధిలో నిర్మించనున్న 'రైల్ ఓవర్ రైల్' ప్రాజెక్ట్‌కు మంగళవారం రైల్వే మంత్రిత్వశాఖ ఆమోదముద్ర వేసింది. డోర్నకల్ రైల్వే జంక్షన్ పరిధిలో 10.5 కిలోమీటర్ల మేర చేపట్టనున్న 'రైల్ ఓవర్ రైల్' ప్రాజెక్ట్ ప్రతిపాదనకు కేంద్ర రైల్వేశాఖ ఆమోదించింది. ప్రాజెక్ట్‌కు సుమారు రూ. 320 కోట్ల ఖర్చు కానుంది. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయితే విజయవాడ-కాజీపేట మార్గంతోపాటు డోర్నకల్-భద్రాచలం రోడ్ మార్గంలోనూ రైళ్ల రాకపోకలు వేగవంతమయ్యే అవకాశాలు ఉన్నాయి. నిత్యం రద్దీగా ఉండే విజయవాడ-కాజీపేట రైలు మార్గంలో ప్రస్తుతం మూడో లైన్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మార్గంలో నాలుగో లైన్ ఏర్పాటు ప్రతిపాదనలు కూడా పురోగతిలో ఉన్నాయి. భద్రాచలం రోడ్ నుంచి విజయవాడకు వచ్చి పోయే రైళ్ల రద్దీ కారణంతో బైపాస్‌లో నిలుస్తున్నాయి. ప్రస్తుతం ఆమోదించిన 10.5 కిలోమీటర్ల మేర రైల్ ఓవర్ రైల్ ప్రాజెక్ట్ పూర్తయితే బైపాస్‌లో రైళ్ల సజావుగా సాగడమే కాకుండా ఈ మార్గంలో బొగ్గు రవాణా వేగవంతం కావడంతోపాటు కొత్త రైళ్లను ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

హసన్‌పర్తి: హసన్‌పర్తి సంస్కృతీవిహార్‌లోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు వివిధ అంశాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ రవి ఒక ప్రకటనలో తెలిపారు. సెల్ రిపేరింగ్(30రోజులు), హౌజ్ వైరింగ్ (30రోజులు), ఏసీ రిఫ్రిజిరేటర్ (30రోజులు) ఎల్ఎంవీ డ్రైవింగ్ (30రోజులు)ల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి, జనగామ, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువకులు దరఖాస్తులు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వయసు ఉండి, తెల్లరేషన్‌కార్డు ఉన్న వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, రేషన్‌కార్డు, ఆధార్ కార్డులతో పాటు విద్యార్హత ధ్రువీకరణ జిరాక్స్ పత్రాలకు ఈనెల 5వ తేదీలో సంస్కృతీ విహార్, హసన్‌పర్తిలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. వివరాలకు ఫోన్ నంబర్ 97040 56522కు సంప్రదించాలని సంస్థ డైరెక్టర్ రవి తెలిపారు.

అధిక వడ్డీ ఆశచూపి మోసం..

- పోలీసులను ఆశ్రయించిన బాధితులు



వివరాలు వెల్లడిస్తున్న బాధితులు

మహబూబాబాద్ రూరల్ : ఓ ప్రైవేట్ సంస్థలో డబ్బులు పెట్టుబడి పెడితే అధిక డబ్బులు వస్తాయని ఓ వ్యక్తి నమ్మించగా పలువురు ఆ సంస్థలో పెట్టుబడిపెట్టారు. ఏడాది కావొస్తున్న నిర్వాహకుడు పెట్టుబడి డబ్బులు ఇవ్వకుండా కాలం వెల్లదీయడంతోపాటు చంపుతానని బెదిరిస్తున్నాడు. దీంతో పలువురు బాధితులు లబోదిబోమంటూ తమకు న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం పోలీసులను ఆశ్రయించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి బాధితులు భావనారుషి మౌనిక, అలేఖ్య, సుజాత కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని పత్తిపాక ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బత్తుల రవికిరణ్ 'అమ్మానాన్న ట్రస్ట్' పేరిట కార్యాలయం ఏర్పాటు చేశాడు. సదరు వ్యక్తి తన సంస్థలో పెట్టుబడిపెడితే డబ్బులు అధికంగా వస్తాయని నమ్మించాడు. దీనిని నమ్మిన పలువురు మొత్తం సుమారు రూ.12 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. అయితే పెట్టుబడిపెట్టి ఏడాది కావొస్తున్నా డబ్బులు ఇవ్వమని అడిగితే సదరు సంస్థ నిర్వాహకుడు మాయమాటలు చెప్పి కాలం వెళ్లదీస్తూ మోసం చేస్తున్నాడు. బంగారం తాకట్టుపెట్టి మరి డబ్బులు తీసుకొచ్చి ఆ సంస్థలో పెట్టుబడి పెట్టామని, తమ డబ్బులు ఇవాలని అడిగితే చంపుతామని బెదిరిస్తున్నాడని బాధితులు పేర్కొన్నారు. దీనిపై తమకు న్యాయం చేయాలని కోరుతూ మహబూబాబాద్ టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. కాగా, ఈ ఘటనపై టౌన్ సీఐ మహేందర్ రెడ్డిని వివరణ కోరగా బాధిత మహిళలు ఫిర్యాదు చేశారని, దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే, 'అమ్మానాన్న ట్రస్ట్' నిర్వాహకుడు బత్తుల రవికిరణ్‌ను వివరణ కోరగా తాను ఎవరిని మోసం చేయలేదని, మహిళల ఆరోపణలు అవాస్తవమన్నారు.

అత్యున్నత శక్తికి నిదర్శనం దుర్గాదేవి



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

హన్మకొండ కల్చరల్: దుర్గాదేవి విశ్వవ్యాప్తమై ఉన్న అత్యున్నత శక్తికి నిదర్శనమని వేయిస్తంభాల దేవాలయం ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ అన్నారు. వేయిస్తంభాల ఆలయంలో జరుగుతున్న శ్రీరుద్రేశ్వరీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా తొమ్మిదోరోజు మంగళవారం అమ్మవారు దుర్గదేవిగా దర్శనమిచ్చారు. గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు మణికంఠశర్మ, అర్చకులు ప్రణవ్ శర్మ, సందీప్‌శర్మ సుప్రభాతసేవ, స్వామివారికి అభిషేకాలు, చతుషష్టి ఉపచార పూజలు నిర్వహించి దుర్గాదేవిగా అలంకరించారు. ఆధ్యాత్మిక వేత్త, ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ భరత్ జీ, తెలంగాణ రాష్ట్ర శాప్ చైర్మన్ కొత్తకాపు శివసేనారెడ్డి దంపతులు దేవాలయాన్ని సందర్శించి పూజలు జరుపుకున్నారు. యాగశాలలో చండీహోమం నిర్వహించారు. సీఎంఆర్ షాపింగ్ మాల్ సౌజన్యంతో భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేశారు. సేవా కార్యక్రమంలో రేపల్లె రంగనాథ్, చొల్లేటి కృష్ణమాచారి, గంద్రాతిరాజు, సిబ్బంది బధుకర్, రామకృష్ణ పాల్గొన్నారు. ఈఓ అనిల్‌కుమార్ పర్యవేక్షించారు.

భద్రకాళి అమ్మవారికి చతురస్త, విమానక సేవ



అమ్మవారికి చతురస్త సేవ

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో జరుగుతున్న శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు మంగళవారం మహా ష్టమి (దుర్గాష్టమి) శ్రీభద్రకాళి జన్మోత్సవం సందర్భంగా అమ్మవారిని మహాదుర్గాదేవిగా అలంకరించారు. ఆలయ ప్రధానార్చకుడు శేషు ఆధ్వర్యంలో అర్చకులు నిత్యాహ్నికం నిర్వహించారు. ఉదయం అమ్మవారిని మహా గౌరీ క్రమంలో దుర్గార్చన జరిపి చతురస్త సేవ నిర్వహించారు. సాయంత్రం విశుంభహాదుర్గార్చన జరిపి విమానకసేవ (సర్వభూపాల వాహన సేవ) నిర్వహించారు. అనంతరం శ్రీభద్రకాళి జన్మోత్సవ విధిని నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయశాఖ వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ కేఎస్.సంధ్యారాణి దేవాలయాన్ని సందర్శించి అమ్మవారికి పూజలు నిర్వహించుకున్న ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. అదేవిధంగా ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అమ్మవారిని ఆలయ ఈఓ రామల సునీత, ధర్మకర్తలు పర్యవేక్షించారు. దేవాలయంలో మహిళలు బతుకమ్మలు ఆడారు.

పంటకు ప్రమాదకారి..

తెల్లదోమ.. మిర్చి పంటకు ప్రధాన శత్రువు

- ఆకుల రసాన్ని పీల్చి మొక్కలను బలహీనం చేస్తుంది
- పంటలో నియంత్రణ చర్యలు చేపట్టాలి
- నాటిన తర్వాత జాగ్రత్తలు తీసుకోవాలి
- రైతులకు శాస్త్రవేత్త ఎ.ప్రశాంత్ కుమార్ సలహాలు



ప్రశాంత్ కుమార్

మహబూబాబాద్ రూరల్ : తెల్లదోమ మిర్చి పంటకు ప్రధాన శత్రువు. ఇది ఆకుల రసాన్ని పీల్చి మొక్కలను బలహీనపరుస్తుంది. అంతేకాకుండా చిల్లి లీఫ్ కర్ల్ వైరస్ వ్యాధిని వ్యాప్తి చేస్తుంది. ఈ నేపథ్యంలో ఈ పంటలో తెల్లదోమ నియంత్రణ చర్యలు, నాటిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహబూబాబాద్ మండలం మల్యాల గ్రామంలోని జెన్నారెడ్డి వెంకటరెడ్డి ఉద్యాన పరిశోధన స్థానం ప్లాంట్ పాథాలజీ శాస్త్రవేత్త ఎ.ప్రశాంత్ కుమార్.. రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

30 నుంచి 40 రోజులు అత్యంత కీలకం..



మిర్చి పంటను ఆశించే తెల్లదోమ



తెల్లదోమ ఆశించి వడలిపోతున్న మొక్క

మిర్చి పంటను నాటిన తర్వాత మొదటి 30 నుంచి 40 రోజులు అత్యంత కీలకం. ఈ సమయంలో తెల్లదోమల సంఖ్య పెరిగితే వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతుంది. అందుకే రైతులు పొలంలో నాటిన మొదటి రోజునుంచే పర్యవేక్షణ, నియంత్రణ చర్యలు చేపట్టాలి.

ప్రారంభ వృద్ధి దశ (10 నుంచి 30 రోజులు) : నీమాయిల్ 1500 పీపీఎం 5 మిల్లీ లీటర్లను లీటర్ నీటిలో పిచికారీ చేయాలి. వర్టిసిలియం లెకానీ/ బ్యావేరియా బాసియానా 5 గ్రాములను లీటర్ నీటిలో కలిపి స్ప్రే చేయాలి. ట్రాప్ క్లోప్స్ పై తెల్లదోమలు చేరితే అక్కడే ప్రత్యేకంగా స్ప్రే చేయాలి.

మధ్య వృద్ధి దశ (30 నుంచి 50 రోజులు) : పొలాన్ని ప్రతీ 3 నుంచి 4 రోజులకు పర్యవేక్షించాలి. తెల్లదోమల సంఖ్య పెరిగితే మారుస్తూ వాడాలి. ఇమిడాక్లోప్రిడ్ 17.8 ఎస్ఎల్ 0.3 మిల్లీ లీటర్లను లీటర్ నీటికి కలిపి స్ప్రే చేయాలి. లేదా థియామెథాక్సామ్ 25 డబ్ల్యూజీ 0.25 గ్రాములను లీటర్ నీటితో స్ప్రే చేయాలి. ఒకే ఔషధాన్ని పునరావృతం చేయకుండా మారుస్తూ వాడాలి.

నియంత్రణ కొనసాగించాలి (50 రోజులపైగా) : తెల్ల దోమల నివారణకు ఎర పంటలపై దృష్టి పెట్టి నియంత్రణ కొనసాగించాలి. వర్షాభావం / పొడిగాలి సమయంలో ప్రత్యేక పర్యవేక్షణ చేయాలి. రసాయనాలను అవసరమైతే మాత్రమే వాడాలి.

దశ/విధానం.. నియంత్రణ చర్యలు

పర్యావరణం, పొలం నిర్వహణ : ఉష్ణోగ్రత 25 నుంచి 35 డిగ్రీల సెల్సియస్, తేమ 60 నుంచి 80 శాతం ఉన్నప్పుడు తెల్లదోమలు ఎక్కువ పెరుగుతాయి. ఈ సమయంలో అదనపు జాగ్రత్తలు తీసుకోవాలి. గాలి ప్రసరణకు అనుకూలంగా మొక్కల మధ్య దూరం పెట్టాలి. పొలంలో నీరు నిల్వ లేకుండా చూడాలి. నాటిన వెంటనే (0 నుంచి 10 రోజులు) ఎకరానికి 10 నుంచి 12 పసుపు రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేయాలి. పొలంలో కలుపు మొక్కలను తొలగించాలి. పత్తి, పొద్దు తిరుగుడు, ఆముదం మొక్కలను పొలం అంచుల్లో నాటాలి.

గొర్రెలను తప్పించబోయి లారీ బోల్తా

- అదుపు తప్పి బైక్‌ను ఢీకొనడంతో హెడ్ కానిస్టేబుల్ మృతి
- మరొకరికి తీవ్రగాయాలు



రవీందర్(ఫైల్)

పరకాల : మండలంలోని కామారెడ్డిపల్లి వద్ద గొర్రెల మందను తప్పించబోయి కంకర లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి హెడ్ కానిస్టేబుల్ ద్విచక్రవాహనంతో పాటు గొర్రెల కాపరిని ఢీకొంది. మంగళవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలపాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ హెడ్ కానిస్టేబుల్ ఆకుల రవీందర్ మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మాందారిపేట నుంచి పరకాల వైపునకు కంకర లోడ్‌తో లారీ వేగంగా వస్తోంది. ఈ క్రమంలో లారీ డ్రైవర్ గొర్రెల మందను తప్పించే క్రమంలో పరకాల పోలీస్‌స్టేషన్‌లో విధులు ముగించుకొని స్వగ్రామం పత్తిపాకకు బైక్‌పై వెళ్తున్న హెడ్ కానిస్టేబుల్ ఆకుల రవీందర్‌ను ఢీకొట్టాడు. అంతటితో ఆగకుండా గొర్రెల కాపరి పాలకుర్తి సాంబయ్యను ఢీకొని బోల్తా కొట్టింది. ఈ విషయం తెలియగానే స్థానికులు 108కు సమాచారం అందజేసి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. సాయంత్రం వరకు తమతో విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో పోలీసు అధికారులు, ఉద్యోగులు ఒక్కసారిగా విషాదంలో మునిగారు. గొర్రెల కాపరి సాంబయ్య వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. ఈ ఘటనపై పరకాల పోలీసులు కేసు నమోదు చేశారు.